
గిరులు.. జల సిరులు



ఎల్‌నినో ప్రభావం ఉన్నా.. సోమశిల జలాశయం నీటితో కళకళలాడుతోంది. పరిసరాలు పర్యాటక శోభను సంతరించుకున్నాయి. జలాశయం నుంచి గేట్ల ద్వారా డెల్టాకు విడుదలవుతున్న నీరు పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అక్కడి కొండలు, పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. సెలవు రోజుల్లో పర్యాటకుల సందడి పెరిగింది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

–న్యూస్‌టుడే, అనంతసాగరం

మరమ్మతుల పేరుతో సాకు.. కార్పొరేషన్ సొమ్ముతో సోకు

వాహనాలతో అద్దె దోపిడీ

● నగర మేయర్ సుజాత కారుకు నగరపాలకసంస్థ ప్రతినెలా రూ.60వేలు అద్దె చెల్లిస్తోంది. కారు అద్దెకు ఇచ్చిన యజమాని డ్రైవర్‌ను నియమించుకోవాలి. అయితే కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు ఉండటం గమనార్హం. వాహనానికి కార్పొరేషన్‌కు చెందిన బంకులోనే పెట్రోల్ పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● పర్యావరణ పరిరక్షణకు నగరపాలకసంస్థ అధికారులు ఒక్కో విద్యుత్తు కారుకు రూ.13లక్షల చొప్పున వెచ్చించి 15 కొనుగోలు చేశారు. ఒకటి రెండు మినహా మిగిలినవి పక్కన పెట్టారు. ఒకసారి ఛార్జింగ్ పెడితే ఎక్కువ దూరం ప్రయాణించడం లేదని, మరమ్మతులకు గురవుతున్నాయన్న సాకుతో మూలకు చేర్చారు. వాటిని కొందరు డ్రైవర్లు సొంతానికి వినియోగించుకుంటున్నారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)



కార్పొరేషన్‌లో వినియోగంలో లేని విద్యుత్తు కార్లు

నెల్లూరు నగరపాలకసంస్థలో పనిచేసే ఉద్యోగులు బినామీ అవతారమెత్తి సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్నారు. విద్యుత్తు కార్లు ఉన్నా.. వాటిని పక్కన ఉంచి అద్దెవి వినియోగిస్తున్నారు. ఒక్కో కారుకు అధికారి స్థాయిని బట్టి రూ.35 వేల నుంచి రూ.45వేల వరకు ప్రతి నెలా చెల్లిస్తున్నారు. అద్దెకు నడిపేవారు పసుపు రంగు నంబర్ బోర్డులు వినియోగించాలి. కార్పొరేషన్‌లో అద్దెకు పెట్టిన ఏ వాహనానికి పసుపు రంగు బోర్డు లేకపోవడం గమనార్హం. సొంతానికి వాడుకుంటున్నట్లు చూపే తెలుపు రంగు నంబర్ బోర్డులే దర్శనమిస్తున్నాయి.

నగరపాలక సంస్థ డ్రైవర్లతో..

నగరపాలకసంస్థ తీసుకున్న అద్దె కార్లకు డ్రైవర్లను యజమానులనే నియమించుకోవాలి. వాటికి కార్పొరేషన్ డ్రైవర్లనే వినియోగిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.24వేల జీతం చెల్లిస్తుండటంతో ఆ నిధులు అద్దెకు కార్లు పెట్టిన యజమానికి మిగిలిపోతుండగా.. కార్పొరేషన్ ఖజానాకు గండి పడుతోంది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మూడు కార్లు, ఓ గుత్తేదారుడు మూడు కార్లు, ఓ మంత్రి గన్‌మెన్ ఒక కారు, మరో ఇద్దరు ఉద్యోగులు రెండు కార్లు అధికారులకు అద్దెకు ఇచ్చారు. సొంత కార్లను అద్దెకు పెట్టి కార్పొరేషన్ డ్రైవర్లను వినియోగిస్తున్నా.. అడిగే వారే లేరు. కొందరు అధికారులు ఇద్దరు వంతున డ్రైవర్లను పెట్టుకున్నారు. నగరంలోనే తిరిగే అధికారులకు ఇద్దరు డ్రైవర్లని నియమించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

చెల్లింపులు ఇలా..

కార్పొరేషన్‌లో ఎస్ఈ వాహనానికి రూ.45వేలు, ఏడీసీ రూ.45వేలు, సిటీ ప్లానర్ రూ.35వేలు, ఆరోగ్యాధికారి రూ.35వేలు, డిప్యూటీ కమిషనర్ రూ.35వేలు, డిప్యూటీ డైరెక్టర్ రూ. 35వేలు, అసిస్టెంట్ కమిషనర్ రూ.35వేలు, టీపీఆర్‌వో రూ. 35వేలు, సెక్రటరీ రూ.35 వేల వంతున కార్లకు అద్దెలు చెల్లిస్తున్నారు. వీరిలో ఇద్దరు అధికారులు సొంత వాహనాలు వినియోగిస్తుండగా.. ప్రతినెలా కార్పొరేషన్ నుంచి అద్దె తీసుకుంటున్నారు. ముగ్గురు ఈఈల వాహనాలకు నెలకు 100 లీటర్ల ఆయిల్ చొప్పున 300 లీటర్లు కార్పొరేషన్ బంకు నుంచి ఇస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

విద్యుత్తు వాహనాలు మరమ్మతులకు గురవుతుండగా అద్దె వాహనాలు వినియోగిస్తున్నాం. ఇందులో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటాం. – నందన్, నగర పాలక సంస్థ కమిషనర్

ఊరి రుణం తీర్చుకుందాం.. గ్రామాభివృద్ధికి పాటు పడదాం.. ఇదీ కొందరి నినాదం. ఈ స్ఫూర్తితో పల్లె ప్రగతికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం 'దాన్‌వీర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రత్యేకంగా 'మేరీ పంచాయత్' యాప్‌ను రూపకల్పన చేసింది. జిల్లా అధికారుల తీరుతో కార్యక్రమంపై ప్రచారం లేక దాతలు ముందుకురాక.. రాష్ట్రంలో జిల్లా చివరి స్థానంలో ఉంది.

ఊరి రుణం తీర్చుకునే తరుణం

ప్రచారం లేక 'దాన్‌వీర్'లో జిల్లా చివరి స్థానం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ, కలెక్టరేట్)

జిల్లాలో 700 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొన్నిచోట్ల డిజిటల్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదు. కొన్నింటికి ఆన్‌లైన్ సౌకర్యం కూడా లేదు. చిన్న పంచాయతీలకు కంప్యూటర్లు లేని పరిస్థితి ఉంది. దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని సాంకేతిక పరమైన వస్తువులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా దాన్‌వీర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. విదేశాల్లో ఉన్న జిల్లావాసులు, స్థానిక దాతలు, సంస్థలు ముందుకు వచ్చి స్థానిక పంచాయతీలకు అవసరమైన కంప్యూటర్ల నుంచి ఇతర సాంకేతిక వస్తువులను విరాళంగా అందించాలని రాష్ట్ర, జిల్లా అధికారుల ద్వారా పిలుపునిచ్చింది.

అందుబాటులోకి ప్రత్యేక యాప్..

దాన్‌వీర్ కార్యక్రమం ద్వారా విరాళంగా ఇచ్చే దాతల కోసం మేరీ పంచాయత్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని సహకారంతో పంచాయతీలకు అవసరమైన అన్ని సాంకేతిక పరమైన వస్తువులను ఇవ్వొచ్చు. ముందుకు వచ్చిన దాతలకు డిజిటల్ ప్రశంసా పత్రం కూడా అందిస్తారు.

నెలరోజులైనా.. వెనుకంజ

దాన్‌వీర్‌ను ప్రవేశపెట్టి దాదాపు నెలరోజులైంది. జిల్లా నుంచి మండల, గ్రామ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. ఎలాంటి ప్రచారం చేయడం లేదు. తిరుపతి, చిత్తూరు, కృష్ణా తదితర జిల్లాల అధికారులు చేసిన ప్రచారంతో దాతలు ముందుకొస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా పూర్తిగా వెనుకబడి ఉందని రాష్ట్ర అధికారుల నివేదికలో ఉంది. ఇకనైనా అధికారులు కార్యక్రమంపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

తీరం.. క్రిస్‌సిటీ వరం

పారిశ్రామికంగా అభివృద్ధి

న్యూస్‌టుడే, కోట, చిల్లకూరు : సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలకు సరైన మౌలిక వసతుల్లేవు. రవాణా సౌకర్యం అంతంతమాత్రమే. అలాంటి ప్రాంతంలో క్రిస్‌సిటీ ఏర్పాటుతో పారిశ్రామిక నగరంగా రూపాంతరం చెందుతోంది. చిల్లకూరు, కోట మండలాల్లోని తమ్మినపట్నం, కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని గున్నంపడియ సమీపంలో మూడు దశల్లో రూ.35,500 కోట్ల పెట్టుబడితో పదివేల ఎకరాల్లో క్రిస్‌సిటీ నిర్మాణం చేపడుతున్నారు. అందులో ఆటో మొబైల్, ఆటో విడి భాగాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ పరికరాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, టెక్స్‌టైల్స్, అపారెల్స్, ఇంజినీరింగ్, లాజిస్టిక్స్ పరిశ్రమలు వస్తాయి. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటే కాదు.. అక్కడ పని చేసే ఉద్యోగుల కోసం 16 రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేయనున్నారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే దాదాపు 4.67 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.



కోట మండలం గున్నంపడియ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

మొదటి విడత రూ.1500 కోట్లు

మొదటి విడత కింద రాష్ట్ర ప్రభుత్వం 2,500 ఎకరాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు దాదాపు రూ.1500 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం వీటితో తొలిదశలో రోడ్లు, వంతెనల నిర్మాణం, తాగు నీటి వసతులు, భూగర్భ డ్రైనేజీ వంటి కీలక పనులు చేపట్టారు.

త్వరగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు

క్రిస్‌సిటీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఈ ఏడాదిలోగా మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమలశాఖ జోనల్ మేనేజర్

స్వర్ణం.. మాయం!

● కోట మండలం సిద్ధవరం సమీపంలో ప్రవహించే స్వర్ణముఖి నది ఉపకాలువైన చల్లకాలువను ఆక్రమించి రొయ్యల చెరువులు, వరిపైరు సాగు చేస్తున్నారు. దీంతో కాలువ కుంచించుకు పోయింది. అంతేకాదు కాలువ వెంబడి ఉన్న రొయ్యల గుంతల వ్యర్థాలు, నీటిని కాలువలోకి విడిచి పెడుతున్నారు. దీంతో నీరు కలుషితం అవుతోంది. ఇంత జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

● కోట మండలం గూడలి సమీపంలోని స్వర్ణముఖి నదికి ఇరువైపులా పలుచోట్ల కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాదు ఇసుక రవాణాకు నదిలో గ్రావెల్‌తో రోడ్ల ఏర్పాటు చేయడంతో ఆనవాళ్లు కోల్పోతోంది.

న్యూస్‌టుడే, కోట

స్వర్ణముఖి నది ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట, వాకాడు తీర ప్రాంత మండలాల మీదుగా పామంజి సమీపం బంగాళాఖాతంలో కలుస్తోంది. రెండు మండలాల్లోని 40 గ్రామాల మీదుగా 30 కి.మీ. దూరం ప్రవహిస్తూ సాగు, తాగు నీటిని అందిస్తోంది. గూడలి నుంచి మూడు కి.మీ. ప్రవహించి వాకాడు స్వర్ణముఖి బ్యారేజీకి సాగునీరు చేరుతోంది. తద్వారా రెండు మండలాల్లోని

నది, ఉపకాలువల ఆక్రమణ

40 గ్రామాల పరిధిలో 11,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. నది గూడలి సమీపంలో పాయగా చీలి ఉపకాలువగా కోట మీదుగా 16 కి.మీ. దూరం 20 గ్రామాల మీదుగా ప్రవహిస్తూ 10 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది.



సిద్ధవరం వద్ద రొయ్యల చెరువులతో ఆనవాళ్లు కోల్పోయిన స్వర్ణముఖి నది ఉపకాలువ

100 ఎకరాలకు పైనే..

రైతులకు ఉపయోగకరంగా ఉన్న స్వర్ణముఖి నది అల్లంపాడు, దొరువుకట్ట, పుచ్చలపల్లి తదితర ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. దాదాపు వంద ఎకరాలు ఆక్రమించారు. దీనివిలువ రూ.10 కోట్ల వరకు ఉంటుంది. ప్రధానంగా నది వెంబడి ఇసుకను తవ్వేస్తున్నారు. గూడలి సమీపంలో అధికారంగా గనులు శాఖ ఇసుక రీచ్ మంజూరు చేసింది. ఇక్కడ తవ్వకాలు చేస్తున్నారు. దీంతో నది గుంతలమయమైంది.

రొయ్యల చెరువుల ఏర్పాటు

నది ఉపకాలువైన చల్లకాలువ వెంబడి ఆక్రమించి పలువురు పంటలు సాగు చేస్తున్నారు. సిద్ధవరం, కర్లపూడి తదితర గ్రామాల్లో రొయ్యలగుంతలు ఏర్పాటు చేశారు. కాలువ వెంట దాదాపు 50 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. అధికారులు స్పందించి ఆక్రమణలు అడ్డుకొని నదిని కాపాడాల్సిన అవసరం ఉంది.

సర్వే చేసి తొలగిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాలతో స్వర్ణముఖి నది, చల్లకాలువ వెంబడి సర్వే నిర్వహిస్తాం. ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.
– మునిరత్నం, ఇరిగేషన్ ఏఈ, కోట

ఆదివారం.. వైద్యం గగనం

పరిశీలన

సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రుల్లో ఉంటూ సేవలందించాల్సిన సమయం. సామాజిక ఆరోగ్య కేంద్రాల(సీహెచ్‌సీ)లో ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఆదివారం రోజుల్లో ఆసుపత్రుల్లో కొందరు వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు మొక్కుబడిగా వైద్య సేవలు అందుతున్నట్లు 'న్యూస్‌టుడే' పరిశీలనలో వెలుగుచూసింది. వైద్యశాలల్లో ఫార్మాసిస్టులు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. వైద్యులు కూడా ఆలస్యంగా వస్తున్నట్లు తెలిసింది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఇందుకూరుపేట, పొదలకూరు

ఇందుకూరుపేట సీహెచ్‌సీలో ఆరుగురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రోజు ఒక్క డాక్టరే విధుల్లో ఉన్నారు. బాలింతలు, శస్త్రచికిత్స జరిగిన వారు, జ్వరాలు, వివిధ వ్యాధులతో పలువురు ఆసుపత్రులో చేరి చికిత్స పొందుతున్నారు. ఉన్న డాక్టర్ ఓపీకే పరిమితమయ్యారు. వార్డులో ఉన్న రోగుల వద్దకు వెళ్లి పరిశీలించిన వారు లేరు. పర్యవేక్షణ కొరవడడంతో కొందరు రోగులు బయటకు వెళుతున్నారు. వ్యాధి నివారణకు తగినంత విశ్రాంతి అవసరం. కొందరు రోగులు బయటకు వెళ్లి దుకాణాల్లో శీతలపానియాలు కొనుగోలు చేసి తాగుతున్నారు.



ఇందుకూరుపేట సీహెచ్‌సీ వెలుపల రోగులు

ఒకే డాక్టరుతో సేవలు

పొదలకూరు సామాజిక ఆసుపత్రిలో ఆరుగురు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తుంటారు. ఆదివారం ఒకే డాక్టరు విధులకు హాజరయ్యారు. ఆసుపత్రి చుట్టు పక్కల మండలాలైన చేజర్ల, కలువాయి, రాపూరు, సైదాపురం, మనుబోలుకు కేంద్రం కావడంతో రోజూ 250 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు. ఆదివారం డాక్టర్లు అందుబాటులో ఉండరని రోగుల సంఖ్య తగ్గింది. మధ్యాహ్నం వరకు 30 మంది రోగులు వచ్చినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు.



పొదలకూరు.. రోగికి చికిత్స చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పోటీల్లో మేటి.. చదరంగంలో కీర్తి

అమరావతి ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం



న్యూస్‌టుడే, నెల్లూరు(బీవీ నగర్) : బాలుడు ఎత్తు వేస్తే ప్రత్యర్థి చిత్తయినట్లే.. ఎవరూ సాధించని రికార్డులు సొంతం అయ్యాయి. రాష్ట్రంలో అతి తక్కువ వయసులో ఇప్పటి వరకు ఎవరూ సాధించని 'ఏపీ యంగెస్ట్ క్యాండిడేట్ మాస్టర్' బిరుదు పొందాడు.. అండర్-9, అండర్-13 విభాగాల పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు.. జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఫిడే రేటింగ్ క్రీడాకారుడిగా నిలుస్తున్నాడు.. నగరానికి చెందిన హేమల్ వర్షన్. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో చెస్‌లో బంగారు పతకం సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు.

మాస్టర్ టైటిల్ కైవసం.. నెల్లూరు నగరానికి చెందిన జయలక్ష్మి, చలపతిరావు దంపతుల కుమారుడు హేమల్ వర్షన్.. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఆరో తరగతి నుంచే ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. చదరంగంలో టైటిల్ సాధించడమంటే ఆటపై పట్టు ఉన్నట్లే. 2200 ఫిడే రేటింగ్ పాయింట్లు సాధించి 'ఏపీ యంగెస్ట్ క్యాండిడేట్ మాస్టర్' బిరుదు పొందాడు.

గ్రాండ్ మాస్టర్‌ను ఓడించి.. గతేడాది గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో గ్రాండ్ మాస్టర్‌ను ఓడించి చెస్‌లోనే ప్రత్యేక స్థానం సాధించాడు. 2024లో బిహార్‌లో జరిగిన అండర్-10 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. గత నెలలో భువనేశ్వర్‌లో జరిగిన కిట్ ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ టోర్నమెంటు పోటీల్లోనూ ప్రత్యేక స్థానం సాధించి రూ.10వేల నగదు బహుమతి సాధించాడు.

కోనలో అమ్మవారి దారు విగ్రహ ప్రతిష్ఠ

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోనలో ఆదివారం ఆదిలక్ష్మి అమ్మవారి బాలాలయ స్థాపనతో పాటు అమ్మవారి దారు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారి మూలవిరాట్టులోని దివ్య కళను దారు విగ్రహంలోకి కళావాహనం చేసి హోమాలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి ఆలయం నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన బాలాలయం వద్దకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ ఉప కమిషనర్ జనార్దన్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళుతున్న అర్చకులు

మట్టిలో కప్పి.. కాసులు మెక్కి..

రూ.15 కోట్ల పనుల్లో రాజకీయం

వాగుల పూడికతీతలో మాయాజాలం

వరదొస్తే వాగులు పొలాలను ముంచేస్తాయి. పంటలు కోల్పోయి కర్షకులు కన్నీళ్లు పెడుతున్నారు. ఏటా రూ.కోట్ల విలువైన పంట వరద పాలవుతోంది. నాయకులకు వాగుల్లో పూడిక తొలగింపు కాసులు కురిపిస్తోంది. గుర్రపుడెక్క మట్టిలో కలిపేసి పైసలు వెనకేసుకుంటున్నారు. రైతులకేమో ఏటా కన్నీళ్లు మిగులుతున్నాయి. ఇదీ మండలంలో వాగుల బాగు పేరుతో జరుగుతున్న దోపిడీ పర్వం.

అల్లూరు, న్యూస్‌టుడే

మండలంలోని డెల్టాకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు సముద్రంలోకి వెళ్లడంలో వాగులు కీలకం. కలుజు, చంగల్, స్వాంపు వాగులతో పాటు పైడేరు తదితర వాటి ద్వారా అనాదిగా వరద సముద్రంలోకి వెళుతోంది. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో పరిసరాల్లోని వారు ఆక్రమించారు. పూడికతో నిండి పోయాయి. దీంతో ప్రవాహం సాగడం లేదు. ఏటా వర్షాకాలంలో పొంగుతున్నాయి. సమీపంలోని గ్రామాలు, పంట పొలాలు మునుగుతున్నాయి. పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. ఈనేపథ్యంలో వీటిని పునరుద్ధరించేందుకు ఇటీవల ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. దీంతో వీటిని స్వాహా చేసేందుకు నాయకులు చక్రం తిప్పారు.



కలుజు వాగులో మట్టిలో గుర్రపుడెక్కను కలుపుతున్న పొక్లెయిన్

పప్పుబెల్లాలుగా పంపకం..

పనులను అనుచరులకు అప్పగించేందుకు కీలక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. బిట్లుగా విడగొట్టారు. ప్రాంతాల వారీగా చోటా నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల నుంచి రూ.తొమ్మిది లక్షల వరకు కేటాయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఉత్తర్వులు తెచ్చినట్లు తెలుస్తోంది. వీరికి పెద్దల అండదండలు ఉండడంతో ఇష్టమొచ్చినట్లు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కొన్నిచోట్ల తీయకుండానే..

అల్లూరు కలుజు వాగులో కొంత ప్రాంతంలో గుర్రపుడెక్కను అక్కడే మట్టిలో కప్పేసి మొత్తం తీసినట్లు ఫొటోలు తీశారని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల అసలు తీయలేదు. చంగల్ వాగులో రోడ్డు పక్కన కొంత మేరకు పూడిక తీసి మమ అనిపించారు. స్వాంపు వాగులోనూ ఇదే తీరు. ఇలా నిధులు మొత్తం కరిగిపోతున్నాయి. రైతులకు మాత్రం ఉపయోగం లేకుండాపోయింది. ఈ విషయమై కాలువల డీఈ పద్మను వివరణ కోరగా పనులు నిబంధనల ప్రకారం జరుగుతున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద సూచనలు చేస్తున్న పోలీసు సిబ్బంది

నెల్లూరు (టౌన్, నవాబుపేట, గూడూరు పట్టణం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసి స్పెషలిస్టు కోర్సుల్లో చేరేందుకు దీన్ని నిర్వహించారు. గూడూరులో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, కావలిలో విశ్వోదయ, నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెంలో ఉన్న అయాన్ డిజిటల్ సెంటర్, జైశ్రీరాం ఇన్‌ప్రా ఐటీ సొల్యూషన్స్ కేంద్రాల్లో పరీక్ష జరగ్గా.. 950 మంది విద్యార్థులకు గాను 916 మంది హాజరయ్యారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

వనామికి వైట్ ఫీకల్ దెబ్బ

ఆందోళనలో ఆక్వా రైతులు


ఎదుగుదల లేని రొయ్యలు

న్యూస్‌టుడే, కోట, చిల్లకూరు

గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, చిల్లకూరు మండలాల్లో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మండలాల్లో కలిపి సుమారు 3,500 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, ఇందులో సుమారు 1000 ఎకరాల్లో వనామి రకాన్ని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రకం రొయ్యల్లో వైట్ ఫీకల్(తెల్ల మల వ్యాధి)సిండ్రోమ్ కనబడడంతో సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

కష్టాల కోర్చి సాగు..

ఇప్పటికే పెరిగిన దాణాతోపాటు ఎగుమతులు తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వంటి కష్టాలతో సతమతమవుతున్నా ఆక్వా రైతులు.. రెండు నెలల క్రితం సాగుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో వనామిలో వైట్‌ఫీకల్ కారణంగా మరో దెబ్బ తగిలింది. దీని వల్ల రొయ్యలు సక్రమంగా మేత తినకపోవడం, వాటి శరీరంలో జీర్ణనాళం పూర్తిగా తెల్లగా మారిపోవడం, తద్వారా తెల్లటి మలతీగలు చెరువు నీటి ఉపరితలంపై తేలియాడుతుండడంతో పూర్తిగా ఎదుగుదల లేకుండా పోతున్నాయి. ఫలితంగా రొయ్య కౌంట్ తగ్గిపోతోంది. సాధారణంగా 60 రోజులకు 65 గ్రాముల నుంచి 80 గ్రాములు వరకు ఉండాలి. కానీ రెండు నెలలైనా 30 కౌంట్ కూడా దాటడం లేదు. ఆపై ఆ కొద్ది రోజుల తర్వాత రొయ్యలు మృతి చెందుతుండడంతో మరింతగా నష్టపోకూడదనే ఉద్దేశంతో సాగుదారులు పట్టేసి విక్రయిస్తున్నారు.

రూ.తొమ్మిది కోట్ల నష్టం

చిల్లకూరులో రెండు వేల ఎకరాలు, కోటలో 1,500 ఎకరాల్లో వనామి సాగు అవుతోంది. సుమారు 300 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఎకరాకు రూ.మూడు లక్షల చొప్పున రూ.తొమ్మిది కోట్ల మేర సాగుదారులు నష్టపోవాల్సి వచ్చింది. సూచనలు పాటిస్తూ సాగు చేయాలని మత్స్య శాఖాధికారులు చెబుతున్నారు.

అన్నదానానికి ఎమ్మెల్యే విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సింధు దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆ మేరకు నగదును ఆలయ ఉప కమిషనర్ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ త్వరలోనే ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గత సర్కారు తప్పులను కొనసాగిస్తున్న కూటమి: విఠపు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : గత ప్రభుత్వం చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యా రంగం, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు అచ్చయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ జాతర


గ్రామోత్సవంలో అమ్మవారు

అనంతసాగరం, న్యూస్‌టుడే: రేవూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మాతమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటాలు, నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రివేళ అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

హామీలు అమలు చేయాలి: పీడీఎస్‌యూ


నగరంలో బైక్ ర్యాలీ చేస్తున్న పీడీఎస్‌యూ శ్రేణులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ ఆరోపించారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సంఘం నగర సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా నగరంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇవి పరిష్కరించకుంటే రాష్ట్ర సచివాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశీర్, నగర అధ్యక్షుడు సుభాష్, కార్యదర్శి సాయి చరణ్, ఉపాధ్యక్షుడు దేవా, సభ్యులు పాల్గొన్నారు.

రెండో రోజు జలాశయాన్ని సందర్శించిన ఎక్స్‌పర్ట్ కమిటీ అధికారులు


ఎగువ ప్రాంతాలను పరిశీలిస్తున్న నిపుణులు

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయాన్ని కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవాల్యూషన్(సీడీఎస్‌ఈ) ఎక్స్‌పర్ట్ కమిటీ అధికారులు గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌లు రెండో రోజు ఆదివారం పరిశీలించారు. ఈ క్రమంలో జలాశయం ఎగువ ప్రాంతం, రిటైనింగ్ వాల్, గ్యాలరీ, ప్రాజెక్టు కార్యాలయం తదితర ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించారు. జలాశయం భద్రత, డ్యామ్ నిర్మాణ పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, నిర్వహణ, పర్యవేక్షణ వంటి అంశాలపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డ్యామ్ మ్యాప్‌ను పరిశీలించిన కమిటీ సభ్యులు, డ్యామ్ భద్రతకు చేపట్టాల్సిన కార్యాచరణపై స్టేట్ డ్యామ్ సేఫ్టీ అధికారులకు నివేదిక అందించనున్నారు. జలాశయంలోని ముఖ్యమైన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, భద్రతకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సోమశిల ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ కుమార్, డీఈఈలు రవీంద్ర ప్రసాద్, విజయ్ బాబు, జేఈఈలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అర్జీ స్థితి, ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అర్జీదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సోమశిలలో 19.181 టీఎంసీల నీరు

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో ఆదివారం నాటికి 77.988కి 19.181 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 288.688 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. పవర్ టన్నల్ ద్వారా 1,450, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, 12వ క్రస్ట్‌గేట్ ద్వారా 1,000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. దక్షిణ కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 111 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

ఆప్యాయత పంచుతూ.. ఆత్మవిశ్వాసం పెంచుతూ

దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక తర్ఫీదు

న్యూస్‌టుడే, దుత్తలూరు

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, ప్రత్యేకావసరాల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చిన్నారుల్లోని లోపాలను సరిదిద్ది మానసిక, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచేలా శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసింది.

ఇవీ తీసుకునే చర్యలు

ప్రత్యేకావసరాల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చూపులేని పిల్లలకు బ్రెయిలీ లిపి నేర్పిస్తున్నారు. వారు బయటకు వెళ్లాలంటే మరొకరిపై ఆధారపడకుండా స్మార్ట్ కెయిన్స్ అందజేశారు. నడిచేటప్పుడు అడ్డంకులు ఉన్నా, ప్రమాదం పొంచి ఉన్నా ముందుగా అవి హెచ్చరిస్తాయి.

జిల్లాలో వివరాలు ఇలా...

మొత్తం భవిత కేంద్రాలు	: 38
ప్రత్యేకావసరాల చిన్నారులు	: 3,003
కేంద్రాలకు వస్తున్న వారు	: 584
ఇంటి వద్ద సేవలు పొందుతున్న వారు	: 365
పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు	: 73

ఆనందం నింపడమే లక్ష్యం

ప్రసాద్‌రావు, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

పిల్లల్లో మానసిక, ఇతరత్రా సమస్యలను నయం చేసి ఆత్మవిశ్వాసం, ఆనందాన్ని నింపాలన్నదే ముఖ్య లక్ష్యం. ఇప్పటికే వారికి అవసరమైన వివిధ రకాల పరికరాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వాటి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం.


విద్యార్థికి ఇంటి దగ్గరే శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

ఇలా గుర్తింపు

బడికి వెళ్లకుండా ఇంటి దగ్గర ఉండే మూడు నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను గుర్తించేందుకు ఏటా ప్రత్యేక సర్వే చేస్తున్నారు. అంగన్‌వాడీ, పాఠశాలలకు వెళ్లి ముందుగా వివరాలు సేకరిస్తున్నారు. సంబంధిత పిల్లల తల్లిదండ్రులను కలిసి వారికి భవిత కేంద్రంలో అందించే సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ● ప్రతి నెలా రవాణా, ఎస్కార్టు భత్యంగా ఏటా రూ. 6 వేలు, బాలికలకు రూ. 2 వేలు ఉపకార వేతనం అందిస్తున్నారు. ● వినికిడి లోపం ఉన్న వారికి ప్రత్యేక పరికరాలు అందజేశారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపిస్టు సేవలందిస్తున్నారు. చిన్నారులకు బొమ్మలు, ఇతర పరికరాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ● ఇంటి వద్ద ఉంటున్న చిన్నారులకు శిక్షకులు వారి వద్దకు వెళ్లి పాఠాలు బోధించడమే కాకుండా వ్యాయామాలు చేయిస్తున్నారు. ● సమాజంలో ఎలా మెలగాలి... ఇతరులను ఎలా గౌరవించాలి... వంటి ప్రాథమిక అంశాలతో పాటు చిత్రాలు గీయించడం, వివిధ ఆకృతులు తయారు చేయించడం వంటివి నేర్పిస్తున్నారు.

అతివలు.. ఉపాధి మార్గాలు

న్యూస్‌టుడే, వెంకటాచలం

వారు ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేశారు. పొదుపు సంఘాలు, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని సొంతంగా వ్యాపారాలు ప్రారంభించారు. ఆర్థిక ఇబ్బందులను జయించి తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా పలువురికి ఉపాధి చూపిస్తూ.. స్ఫూర్తిగా నిలుస్తున్నారు వెంకటాచలం మండలానికి చెందిన ఈ నారీమణులు.

పది మందికి ఉపాధి



వెంకటాచలం మండలం ఇస్కపాళెం గ్రామానికి చెందిన బెల్లంకొండ సుభాషిణి పొదుపు ద్వారా రూ.రెండు లక్షలు, స్త్రీ నిధి ద్వారా రూ.లక్ష, బ్యాంకు నుంచి వ్యక్తిగతంగా రూ.10 లక్షలు రుణం తీసుకున్నారు. మొత్తం రూ.13 లక్షలు వెచ్చించి స్థానికంగానే పేపర్ ప్లేట్స్ యూనిట్ ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలో విక్రయిస్తున్నారు. మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రతి నెల బ్యాంకు చెల్లింపులు, ఇతర ఖర్చులు పోనూ.. రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని స్వయం ఉపాధి పొందడంతో పాటు మరి కొందరికి పని కల్పించడం ఆనందంగా ఉందని సుభాషిణి తెలిపారు.

కుమార్తెలకు వివాహం



వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళేనికి చెందిన తురకా భవాని పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. సొంతంగా ఉపాధి పొందాలన్న లక్ష్యంతో పొదుపు ద్వారా రూ. రెండు లక్షలు, స్త్రీ నిధి ద్వారా రూ.లక్ష రుణం తీసుకున్నారు. ఇంటి వద్దనే కిరాణా దుకాణంతో పాటు, టెంకాయల వ్యాపారం పెట్టారు. వ్యాపారాలు బాగా జరుగుతుండటంతో ఆర్థిక కష్టాలు తీరాయని, నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందని భవాని తెలిపారు. తన ఇద్దరి కుమార్తెలకు వివాహాలు చేయగలిగానని సంతోషం వ్యక్తం చేశారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.14,940
(3శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,19,520
వెండి గ్రాము :	రూ.249.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	112
లేయర్	140
బ్రాయిలర్స్	208
బ్రాయిలర్ స్కిన్‌లెస్	230
లేయర్ మాంసం	238

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు, న్యూస్‌టుడే : మండలంలోని తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

ద్విచక్ర వాహనం బోల్తా ఒకరి మృతి

సీతారామపురం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సీతారామపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మార్కాపురం జిల్లా సీఎస్‌పురం మండలం నల్లమడుగుల ఎస్సీకాలనీకి చెందిన గుడిగుట్ల నారాయణ(47) బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటారు. ఆయన భార్య అంగన్‌వాడీ కార్యకర్తగా గ్రామంలో పనిచేస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుమార్తెను ఇంటి వద్ద నుంచి ద్విచక్రవాహనంపై పోరుమామిళ్లకు తీసుకెళ్లి పాఠశాలలో వదిలిపెట్టి స్వగ్రామానికి వస్తుండగా సీతారామపురం పంచాయతీ నారాయణప్పపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నారాయణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరాజేష్ తెలిపారు.

కలిసొచ్చిన కాలం.. ధాన్యం ధరహాసం

న్యూస్‌టుడే, సంగం

జిల్లాలో ఎడగారు సాగు వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పొలం వద్దనే ధాన్యం కొనుగోలు ధరలు గణనీయంగా కొనసాగుతుండటంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కన్నా అత్యధికంగా వ్యాపారులు కొనుగోలు చేస్తూ, వెంటనే చెల్లింపులు చేస్తుండటం విశేషం. ఎల్‌నినో భయభ్రాంతులకు గురిచేస్తున్నా, జిల్లాలో మాత్రం ఎడగారు సాగుకు ఉపయోగకరంగా మారింది.

మూడు లక్షల ఎకరాల్లో..

జిల్లాలో ఎడగారు కింద మూడు లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. సోమశిల, కండలేరు జలాశయాల నీటి ఆధారంగా ప్రారంభమైన పంట సాగు కోతలకు దశకు చేరింది. కనిగిరి జలాశయం ,స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలో ముందుగా నాట్లు జరిగాయి. దాంతో అక్కడ కోతలు ప్రారంభమయ్యాయి. ఎకరానికి సరాసరి మూడు నుంచి మూడున్నర పుట్లు వంతున ధాన్యం దిగుబడులు లభిస్తున్నాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ కోతకు సన్నాహాలు సాగుతున్నాయి.


దువ్వూరులో బస్తాల్లో నింపుతున్న ధాన్యం

అనుకూలంగా..

ఎల్‌నినో కారణంగా వర్షాభావంతో పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడతాయని అన్నదాతలు తొలుత ఆందోళనకు గురయ్యారు. అయితే అనూహ్యంగా అనుకూలంగా మారింది. నిరంతరం ఎండ కాస్తుండటంతో పంట ఏపుగా ఎదిగేందుకు అవసరమైన పరిస్థితి ఉండడంతో 125 రోజుల పంట కాలం మరో పది రోజులకు పెరగడంతో పిలకలు అధికంగా వచ్చాయి. దీంతో ఎకరానికి సరాసరి మూడు నుంచి మూడున్నర పుట్ల వంతున దిగుబడి వచ్చింది. ఎడగారు సాగు రాష్ట్రంలో మన జిల్లాలోనే ఎక్కువగా ఉంది. గోదావరి జిల్లాలో కొంతమేర జరిగినా అక్కడ ముతక రకం వరి సాగు చేపట్టారు. జిల్లాలో కె.ఎన్.ఎం 1638 రకం వంగడాన్ని 2.5లక్షల ఎకరాలకు పైగా సాగు చేశారు. ఈ రకానికి గిరాకీ బాగుండటంతో వ్యాపారులు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

రూ.25వేల చొప్పున..

పుట్టి ధాన్యాన్ని రూ.25వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ దఫా పొలాల్లోనే కోత పూర్తయిన వెంటనే చేతిలో చెల్లింపులు చేసి కొనుగోలు చేయడం ఇదే ప్రథమం. ఫలితంగా ఒక్కో ఎకరానికి సుమారు రూ.80వేలు లభిస్తుండగా వ్యయం రూ.40వేలు పోను మరో రూ.40వేలు ఆదాయం వస్తుంది.


సంతోషంగా ఉంది- ఎం.శ్రీనివాసులు, పాటూరు, కోవూరు మండలం

కె.ఎన్.ఎం 1638 రకం వరి సాగు చేశాను. ఎకరానికి సుమారు నాలుగు పుట్ల వంతున దిగుబడి లభిస్తుండగా, పుట్టి ధాన్యాన్ని రూ.25వేల వంతున విక్రయించాను. చాలా సంతోషంగా ఉంది.

రైలు కింద పడి వృద్ధుడి దుర్మరణం

కావలి, న్యూస్‌టుడే: రైలు ఎక్కబోతూ అదుపు తప్పి పట్టాలపై పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కావలిలో ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పి.ఈశ్వరరాజు (70) అనే వృద్ధుడు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఓ యజమాని వద్ద పనిచేస్తున్నారు. ఆ యజమానికి జలదంకి మండలంలో పొలాలు ఉన్నాయి. దీంతో ఆ పొలాల వద్ద ఈశ్వరరాజు సహాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో భీమవరానికి వెళ్లేందుకు ధర్మవరం- నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నారు. స్టేషన్‌కు ఆయన ఆలస్యంగా చేరుకోవడంతో కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నం చేయగా అదుపుతప్పి పట్టాలపై పడిపోయారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై చెప్పారు.

రౌడీ షీటరు దారుణ హత్య


సాయితేజ (పాతచిత్రం)

నెల్లూరు(బీవీ నగర్), న్యూస్‌టుడే: ఓ రౌడీ షీటరు దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం రాత్రి నెల్లూరు నగరం ఆర్టీవో కార్యాలయ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చంద్రమౌళి నగర్‌కు చెందిన లక్ష్మీశెట్టి సాయితేజ అలియాస్ కమ్మ సాయి(24)పై వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటు ఉంది. గతేడాది పోలీసులు అతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపారు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చాడు. అనంతరం బుచ్చిరెడ్డిపాలెంలో ఉంటున్నట్లు తెలిసింది. ఆదివారం ఆయన వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు అతన్ని వెంబడించారు. ఆర్టీవో కార్యాలయ సమీప ఖాళీ స్థలంలో సిమెంటు రాయితో తలపై మోది హత్య చేశారు. సమాచారం అందుకున్న నగర, నెల్లూరు గ్రామీణ డీఎస్పీలు గిరిధర్, ఘట్టమనేని శ్రీనివాసరావు, వేదాయపాలెం ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య, నగర ఇన్‌స్పెక్టర్లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. హత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హత్య వెనక బీవీ నగర్‌కు చెందిన ఓ రౌడీషీటరుతో పాటు మరికొందరి ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. పాతకక్షలే కారణమని తెలుస్తోంది. పోలీసులు విభిన్న కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నమస్తే వెలుగులు

ఆరోగ్యానికి, భద్రతకు ప్రాధాన్యం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం 'నమస్తే' పథకానికి రూపకల్పన చేసింది. నుంచి కూటమి ప్రభుత్వం కార్మికులకు ప్రమాద బీమా అమలు చేస్తోంది. బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తోంది. ఇప్పుడు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా వారిని ఆరోగ్యపరంగా, ఆర్థికంగా బలోపేతం చేయనుంది. వివరాలిలా ఉన్నాయి.

అర్హుల గుర్తింపు

ఈ పథకంలో భాగంగా నెల్లూరు నగరపాలకసంస్థతో పాటు కావలి, ఆత్మకూరు, గూడూరు, బుచ్చిరెడ్డిపాలెం పట్టణాల్లో అర్హులైన పారిశుద్ధ్య కార్మికులను గుర్తిస్తున్నారు. సెప్టిక్ ట్యాంకు క్లీనర్లు, డంపింగ్‌యార్డుల వద్ద చెత్త వేరు చేసేవారు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే వారిని గుర్తించి పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అన్ని మున్సిపాలిటీల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. తొలి విడతగా కొందరికి పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందయజేయనున్నారు.


పనిచేస్తున్న కార్మికులు

ప్రత్యేక శిక్షణ

పథకం పరిధిలోకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజారోగ్య విభాగానికి వెళ్లి తమ పేర్లు, వివరాలు నమోదు చేయించుకోవాలి. అలా నమోదైన వారికి వృత్తి భద్రత, నైపుణ్యాలపై నిపుణులతో శిక్షణ కల్పిస్తారు. ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు గమ్ బూట్లు, గ్లౌజులు, ఇతర వస్తువులు అందజేయనున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా కల్పిస్తారు. ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. రాయితీ రుణాలు అందించనున్నారు. రూ.5లక్షల వరకు ఉన్న రుణాలపై వడ్డీ రాయితీ కల్పిస్తారు.

జిల్లాలో నగరం, పట్టణాలు	జనాభా	పారిశుద్ధ్య కార్మికులు	ప్రతిరోజూ సేకరిస్తున్న చెత్త
5	12 లక్షలు	2,800	500 టన్నులు

కావలి

• కావలి • ఉదయగిరి • ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: సంగం మండలం దువ్వూరు సమీపంలో నెల్లూరు- ముంబయి జాతీయరహదారిపైకి ముళ్ల చెట్లు కమ్ముకు రావడంతో ప్రమాదకరంగా ఉంది. వాటిని తొలగించాలి. – వాసు

సమాధానం: వెంటనే వాటిని తొలగిస్తాం.
– పాపారావు, ఏఈ జాతీయరహదారి విభాగం

? కావలి ఉత్తర జనతాపేట ప్రాంతంలో నిత్యం పలుసార్లు విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లుతోంది. – ఎలీషా మ్యాథ్యూస్, ఉత్తరం జనతాపేట, కావలి పట్టణం

✓ స్థానిక సమస్యల పరిష్కారానికి సరఫరాలో నిలిపివేత తప్పడంలేదు. ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. – వై.వసంతరావు, సహాయ ఇంజినీర్, ఏపీఎస్‌పీడీసీఎల్, కావలి

? దగదర్తి మండలం కౌరుగుంట ఎస్సీ కాలనీలో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తాగు నీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలి.–వెంకయ్య, కాలనీవాసి

✓ తాగు నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. – శిరోమణి, పంచాయతీ కార్యదర్శి

? ఉదయగిరి పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో సిమెంట్ రోడ్డు మధ్యలో ఉన్న వాల్వ్‌గుంత ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు రాత్రివేళ కనిపించక అందులోపడి గాయాలపాలవుతున్నారు. – వెంకటసుబ్బయ్య, స్థానికుడు

✓వాల్వ్‌గుంతను సరిచేసి సమస్యను పరిష్కరిస్తాం.–వెంకటేశ్వర్లు, పంచాయతీ అభివృద్ధి అధికారి

?ఏఎస్‌పేట మండలం చిన్నబ్బీపురం గ్రామంలో సిమెంటు రోడ్లు వేశారు. అయితే సైడుకాలువలు నిర్మించలేదు. దీంతో మురుగు రహదారిపైన పారుతోంది. – వెంగయ్య, గ్రామస్థుడు

✓ చిన్నబ్బీపురం గ్రామంలోని రోడ్లను పరిశీలించి డ్రయిన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తాం.– మునిరత్నం, డిప్యూటీ ఎంపీడీవో

? వరికుంటపాడు మండలం నల్లబోతులవారిపల్లెలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. దారిన వెళుతున్న చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. – దేవండ్ల శ్రీధర్

✓ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.
– పి.రమేష్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో

? వరికుంటపాడు మండలం తూర్పుచెన్నంపల్లెలో పగలు రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. – నారాయణ, స్థానికుడు

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
– పి.రమేష్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో

? అనంతసాగరం మండలం సంజీవ నగరం గ్రామంలోని రామాలయం వీధిలో స్థానికులు వ్యర్థాలను, చెత్తాచెదారాలను రోడ్డుపైనే వేస్తున్నారు. –రవి, గ్రామస్థుడు

✓ వెంటనే చెత్తను తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరిస్తాం.
–రమణరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి

గురుకులంలో 15 ఖాళీలు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో వివిధ తరగతుల్లో ఏర్పడిన పోస్టుల భర్తీకి సోమవారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానాచార్యులు పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదో తరగతిలో 6, ఆరులో 2, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 4, బైపీసీలో 3 చొప్పున మొత్తం 15 ఖాళీలున్నాయన్నారు. అర్హులైన వారు తమ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలకు హాజరవ్వాలన్నారు. మార్కుల ఆధారంగా ప్రవేశం లభిస్తుందని చెప్పారు.

పచ్చందం మాయం.. ఆహ్లాదం దూరం

న్యూస్‌టుడే, సంగం

సంగం బ్యారేజీ వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన ఉద్యానవనం రూపు రేఖలు కోల్పోయింది. పచ్చందం మాయం కాగా, ఆహ్లాదం దూరమైంది. తెలుగు గంగ విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిరంతరం నీటి నిల్వ

సంగం పెన్నానదిపై పురాతన ఆనకట్ట స్థానంలో సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్యారేజీని ప్రారంభించి సెప్టెంబరు నెలకు నాలుగేళ్లు పూర్తవుతుంది. పెన్నానదిలో బీరాపేరు, బొగ్గేరు సంగమించే ప్రదేశం, నెల్లూరు ముంబయి జాతీయరహదారికి అత్యంత సమీపంలో ఉండటంతో పర్యాటకులు పెన్నా అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా వస్తుంటారు.

పది సెంట్ల స్థలంలో

బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి పచ్చదనం పెంచారు. పర్యాటకులు సేద తీరేందుకు, సంచరించేందుకు ప్రత్యేకంగా కాలి బాటలను టైల్స్, గ్రానైట్‌తో ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశం నుంచి పెన్నా నదిలోని నీటి నిల్వతో పాటు, కనిగిరి జలాశయం, బెజవాడపాపిరెడ్డికాలువలకు సాగునీటిని తరలించే కాలువ అందాలు అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఇందుకు అనుగుణంగా వసతులు మరింత మెరుగుపడతాయని అందరూ భావించారు.


సంగం బ్యారేజి వద్ద గడ్డి ఎండిపోయి ఇలా..

నిర్వహణ లేక

గుత్తేదారుల నిర్వహణలో బ్యారేజీ ఉన్నంత వరకు వారి సిబ్బంది పచ్చదనం కాపాడేందుకు, వివిధ రకాల మొక్కలను సంరక్షించేందుకు నీటిని పడుతుండేవారు. అక్కడ పరిశుభ్రత కొరవడకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ఏడాది క్రితం వారి నిర్వహణ పూర్తవడంతో తెలుగుగంగ విభాగానికి అప్పగించారు. అప్పటి నుంచి నిర్వహణ కరవైంది. దీంతో మొక్కలు చనిపోతున్నాయి. ఎండ తీవ్రతకు పచ్చదనం నిలువునా ఎండింది. రక్షణ ఏర్పాటు లేనందున ఆకతాయిలు అక్కడకు చేరుకుని మద్యం తాగి సీసాలను అక్కడే వేస్తున్నారు. ఈ విషయమై తెలుగుగంగ ఏఈ ప్రసాద్‌తో మాట్లాడగా తగు చర్యలు చేపడతామన్నారు.

బాబోయ్.. కొనలేం.. తినలేం!

అనుమసముద్రంపేట, సీతారామపురం, ఆత్మకూరు, న్యూస్‌టుడే: అమెరికా, ఇరాన్ యుద్ధం, ఎల్‌నినో ప్రభావం పేద, మధ్య తరగతి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. నిత్యావసరాల వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశన్నంటుతుండడంతో సామాన్య ప్రజల జేబులకు చిల్లు పడుతోంది. నలుగురు సభ్యులున్న మధ్య తరగతి కుటుంబంపై నెలకు రూ.3000 అదనపు భారం పడుతోంది. మే నెల వరకు స్థిరంగా ఉన్న బియ్యం ధరలు జూన్ నుంచి క్రమంగా పెరుగుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల సాకు చూపుతూ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. జూన్‌లో కిలో బియ్యం ధర రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.70కు చేరుకుంది.

ప్రస్తుతం ఇలా...

(కిలోల్లో)	జూన్ (రూ.ల్లో)	ప్రస్తుతం (రూ.ల్లో)
చక్కెర	55	70
మినపప్పు	120	140
కందిపప్పు	100	135
ఉల్లిపాయలు	40	60
సెనగపప్పు	70	80
వేరుసెనగ నూనె	175	185
పామాయిల్	135	150
బెల్లం	60	85

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు

నియంత్రణ శూన్యం?: సాధారణంగా నిత్యావసర ధరలను అదుపు చేసేందుకు జిల్లా స్థాయిలో నియంత్రణ కమిటీ ఉంటుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. కమిటీ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్, వైస్ ఛైర్మన్‌గా జేసీ, కన్వీనర్‌గా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉంటారు. సభ్యులుగా తూనికలు, కొలతలు, మార్కెటింగ్, రవాణాశాఖాధికారి సభ్యులుగా ఉంటారు.

ఖండకావ్యాలకు రెండు కళ్లు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గుర్రం జాషువా, జంధ్యాల పాపయ్యశాస్త్రిలు ఖండకావ్యాలకు రెండు కళ్లు అని తెలుగుభారతి సేవాసమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి అన్నారు. ఆత్మకూరులో తెలుగుభారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఒక మంచిమాట అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖండకావ్యంలో రెండు కళ్లు అనే అంశంపై మాట్లాడారు. పిరదౌసి, గబ్బిలం, ముంతాజ్మహల్, శిశువు జాషువాగారి ఆవేదనను ఆవిష్కరించారు. కరుణశ్రీ, విజయశ్రీ, ఉదయశ్రీ, సాంధ్యశ్రీ, అమర్‌ఖయ్యమ్, కుంతీకుమారి, అంజలి, పుష్పవిలాపం కావ్యాలలో ఆణిముత్యాలు ఆలపించారు. కార్యక్రమంలో తెలుగుభారతి సేవాసమితి సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు గోవిందరెడ్డి, రమణయ్య, శేషారెడ్డి, సుబ్రహ్మణ్యం, రామయ్యస్వామి, సుబ్బయ్య, శ్రీనివాస రాజు, రవీంద్రకుమార్, అపర్ణచక్రవర్తి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి దుర్గాన్ని సందర్శించిన నేవీ బృందం

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి దుర్గాన్ని విశాఖపట్నం నౌకాదళ బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా దుర్గం కొండపై గల పెద్ద మసీదు, చిన్న మసీదు, టప్కా, కోనకాలువ, గుర్రపుశాల, ఫిరంగి గుంత, రక్షక భటుల బురుజులు తదితర ప్రాంతాలను వీక్షించి చారిత్రక నేపథ్యం, విశిష్టతలను తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభచాటి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఉపకార వేతనాలు మంజూరు చేస్తామన్నారు. అందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15, వేలు, రూ.10, వేలు రూ.5 వేలు వంతున అందించాలని రూ.30 వేలు ఆ పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావుకు అందజేశారు.

108 వాహనంలోనే ప్రసవం

జలదంకి, న్యూస్‌టుడే: జలదంకి మండలంలోని బ్రాహ్మణక్రాక అరుంధతివాడకు చెందిన జలదంకి నాగసుధాకు పురిటి నొప్పులు రావడంతో ఆదివారం తెల్లవారుజామున 108 వాహనంలో కావలి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే తొమ్మిదోమైలు సెంటర్ వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 మెడికల్ టెక్నీషియన్ అశోక్, పీహెచ్‌సీ వైద్యుని సూచనల మేరకు వాహనంలోనే కాన్పు చేశారు. నాగసుధా ఆడబిడ్డకు జన్మనివ్వగా, ప్రస్తుతం తల్లీ బిడ్డా ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలో పురాతనమైన కావలి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1978-79 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోలాహలంగా జరిగింది. ఆదివారం స్థానిక ఏవీఎస్ కల్యాణమండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గ మాజీఎమ్మెల్యే, తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని రామారావు హాజరయ్యారు. గత మూడేళ్లుగా ఆగస్టు నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటాన్ని ఉద్దేశించి ప్రత్యేకంగా కొనియాడారు. వచ్చే ఏడాది జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్ల బాధ్యత అంతా తనదేనంటూ వెల్లడించారు. కార్యక్రమానికి ఆహ్వాన కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించిన జీఎస్టీ మండలి సభ్యుడు అమరా వెంకట సుబ్బారావు, విశ్రాంత ఎస్సై పసుపులేటి బాబురావు, విశ్రాంత ఏఈ నాగశంకరసింగ్, ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో సహచర పూర్వ విద్యార్థులు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని స్పార్క్‌సిటీలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంచి పరమేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భూమిపూజ పూర్ణాహుతి, పవిత్రహోమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్... అడుగంటుతున్న భూగర్భజలం


గతేడాది ఆగస్టులో నిండుకుండలా కనిపిస్తున్న కృష్ణమందిరం వద్ద కోనేరు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఉదయగిరి ప్రాంతంలోని భూగర్భజలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. అసలే మెట్ట ప్రాంతం కావడంతో వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే తాగు, సాగు నీటికి ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి సకాలంలో వర్షాలు కురిసినా మెట్ట ప్రాంతంలో భూగర్భజలాలు నిలకడగా ఉండటం అంతంత మాత్రమే. ఈ ప్రాంతంలోని రైతులు అధిక సంఖ్యలో వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు వేసవి కాలాన్ని తలపిస్తోంది. దీనికితోడు పడమటి గాలుల ఉద్ధృతి సైతం కొనసాగుతోంది. ఇప్పటికే ఉదయగిరిలోని చెరువులు, కుంటల్లో నీటి జాడ లేకుండా వట్టిపోతున్నాయి. గండిపాళెం జలాశయంతోపాటు నక్కలగండి, మర్రివూట్ల రిజర్వాయర్లలో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుంటోంది. ఎల్‌నినో ఎఫెక్ట్ ఇలాగే కొనసాగితే సాగులో ఉండే బత్తాయి, మామిడితోపాటు ఇతర ఉద్యానవన పంటలు ఎండిపోతాయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ప్రస్తుతం ఇలా..

వైభవంగా నాగారపమ్మ పూజలు

చేజర్ల, న్యూస్‌టుడే: మండలంలో నడిగడ్డ అగ్రహారం గ్రామదేవత నాగారపమ్మకు ఆదివారం ఘనంగా జలాభిషేకం చేశారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకొంటూ గ్రామంలోని మహిళలంతా ఎరుపురంగు దుస్తులు ధరించి పెన్నానదికి వెళ్లి కుండలతో నీటిని తెచ్చి అభిషేకించారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీ ధర కన్నా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ హెచ్చరించారు. ఉదయగిరి పట్టణంలోని మద్యం దుకాణాలను ఆదివారం తనిఖీ చేసి విక్రయాలు చేస్తున్న మద్యం సీసాలు, దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా అనధికార మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదవుతాయన్నారు.

చెరువు అభివృద్ధి పనుల ప్రారంభం

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని కట్టుబడిపాళెంలో రెడ్డిగుంట చెరువు అభివృద్ధి పనులను తెదేపా మండల ఇన్‌ఛార్జి రవికుమార్ చౌదరి ఆదివారం ప్రారంభించారు. చెరువు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.8.50 లక్షల నిధులను మంజూరు చేసింది. నీటి సంఘం అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నాయకులు హరికిషోర్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశేష సేవలకు పురస్కారం

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచి తరఫున సేవలందించిన పూర్వ ఆర్డీవో ఎస్.సన్నీవంశీకృష్ణ, వ్యాపారి రమేష్‌రెడ్డిలకు అరుదైన పురస్కారాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సెప్టెంబరు 1వ తేదీన విజయవాడలో వీరు అవార్డులు అందుకోనున్నారు. వారిని ప్రస్తుత ఆర్డీవో ఎలీషా ఆదివారం కావలిలో అభినందించారు.

పలు ఆలయాల్లో చోరీ

కలిగిరి, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తులు పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చిన్నఅన్నలూరులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో అమ్మవారికి చెందిన రెండు మంగళసూత్రాలు, అంకమ్మ ఆలయంలో అమ్మవారి ముక్కుపుడక, హుండీ, పోలేరమ్మ ఆలయంలో హుండీలను దుండగులు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే ఆలయాల తలుపులు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై లతీఫున్నీసా సూచనల మేరకు పోలీసు సిబ్బంది చోరీ జరిగిన ఆలయాలను పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రల నమూనాలు సేకరించారు.

స్థలం విషయమై ఘర్షణ

అనంతసాగరం: స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసిన ఘటన మండలంలోని శంకరనగరంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శంకరనగరానికి చెందిన మారేళ్ల ప్రసాద్ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాడు. అయితే అదే స్థలంలో అన్న పెంచలయ్యకు కూడా వాటా ఉందని తెలపడంతో ఇరువర్గాలు వాదనకు దిగారు. ఈ క్రమంలో ప్రసాద్‌పై పెంచలయ్య, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాప్ విషయమై వివాదం

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రకోట వద్ద నిర్వహిస్తున్న అనధికారిక మద్యం దుకాణం విషయమై నిలదీసినందుకు తనపై దాడి జరిగినట్లు పులుసు శ్రీనివాసులు అనే బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. బెల్ట్ షాప్ దుకాణదారుడు సుధీర్‌ను తప్పుబట్టడంతో, అతని తరఫున జరుగుమల్లి పీటర్, నరేష్, సంతోష్, సుందరరాజులు తనపై దాడి చేశారని శ్రీనివాసులు వాపోయారు. ఈ దాడిలో గాయపడిన ఆయన ప్రస్తుతం కావలి ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కావలి గ్రామీణ స్టేషన్ పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మర్రిపాడు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని చుంచులూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మర్రిపాడుకు చెందిన పబ్బులేటి శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై చుంచులూరు క్రాస్ రోడ్డును దాటుతుండగా నెల్లూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కావలి: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న ఏ.శ్రీనివాసులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి పట్టణ శివార్లలోని ముసునూరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. బాధితుడు బోగోలు మండలం తుళ్లూరు గ్రామవాసి. వ్యక్తిగత పనులపై కావలి పట్టణానికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు.

మర్రిపాడు: మర్రిపాడు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఆదివారం కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కారు నెల్లూరు వైపు నుంచి బద్వేలు వైపు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని వెంగళరావునగర్ ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలోని పోలేరమ్మ ఆలయం వద్ద సామూహిక పొంగళ్లు పెడుతున్న క్రమంలో ఇరువర్గాల నడుమ ఏర్పడ్డ వివాదం ఘర్షణకు తావిచ్చింది. ఆదివారం కావలి రెండో పట్టణ పోలీసులు ఇరువైపులా కేసులు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. క్షతగాత్రులను కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. ఓ వర్గం తరఫున పార్థపు సాతెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దార్ల పెంచలయ్య, రమణ, శ్రీనివాసులు, మున్నోడులపై కేసు నమోదు చేశారు. మరో కేసులో దార్ల వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో దార్ల గోపి, గురవయ్య, సింహాద్రి, శ్రీను, పార్థపు వెంకీ, కల్యాణ్ నిందితులుగా ఉన్నారు.

అదుపుతప్పితే.. అపాయమే!



వింజమూరు- ఆత్మకూరు రోడ్డులో చంద్రపడియ అలుగు చప్టా మలుపు వద్ద ఏర్పడిన ఇసుక కుప్పలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ రహదారిన నిత్యం పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్లు వెళుతున్నాయి. మలుపు వద్ద కుదుపులకు టిప్పర్ నుంచి ఇసుక జారి కింద పడుతూ కుప్పలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతుండటంతో చోదకులు గాయపడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ ఫయాజ్ అహమద్ మాట్లాడుతూ.. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వింజమూరు

ప్రచారానికి పంపితే.. మూలన పడేశారు

కావలి వైకుంఠపురం పట్టణ ఆరోగ్యకేంద్రంలో ప్రచారం కోసం వచ్చిన ఫ్లకార్డులను మూలన పడేశారు. లింగ నిర్ధారణ నేరంతో పాటు ఇతర అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఈ ప్రచార సామగ్రిని వైద్యారోగ్యశాఖ తరపున పంపించారు. అయితే వాటిని స్థానికంగా ఎవరూ చేతపట్టుకున్న దాఖలాల్లేవు. వైద్యులు, సిబ్బంది వాటిని అలా వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలు విమర్శలున్నాయి.
– న్యూస్‌టుడే, కావలి




నిర్లక్ష్యం.. ప్రమాదకరం



సంగం బ్యారేజీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి గొట్టాల ద్వారా తాగునీటిని తరలించేందుకు బెజవాడ పాపిరెడ్డి కాలువ వంతెన వద్ద గోతులు తవ్వి వదిలేశారు. అయితే గొట్టాలను అమర్చడంలో నిర్లక్ష్యం వహించడంతో ఆ గోతులు ప్రమాదకరంగా మారాయి. నివాస గృహాలకు ఆ గోతులు దగ్గరగా ఉండటం.. చిన్నారులు ఆడుకునే సమయంలో అందులోపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వెంటనే గొట్టాలేర్పాటు చేసి వాటిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంగం

రూ.లక్షలు వెచ్చించారు.. మూలకు చేర్చారు!

గత వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు(ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు) రూ.లక్షలు ఖర్చుచేసి గ్యాస్ సిలిండర్‌తోపాటు గ్యాస్ పొయ్యిని అందించింది. కానీ ప్రస్తుతం అవి అట్టపెట్టెల్లో తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. దుత్తలూరు-1 రైతుసేవా కేంద్రంలో పరికరాలను మూలన పడేయంతో 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. ఈవిషయమై వ్యవసాయాధికారిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.
– న్యూస్‌టుడే, దుత్తలూరు



గురుకుల పాఠశాల వద్ద అధ్వాన పారిశుద్ధ్యం

సోమశిల గ్రామంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పాఠశాల వంటశాల వెనుక భాగంలో మురుగు నిల్వ ఉండటంతో పరిసర ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. పందులు, కుక్కలు సంచరిస్తూ పరిసరాలను మరింత అధ్వానంగా మారుస్తున్నాయి. వంటశాలకు సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో దోమలు, ఈగలు పెరిగి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదముందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, అనంతసాగరం



నో బ్యాగ్ డే... అంటారంతే!

న్యూస్‌టుడే, దుత్తలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమం క్షేత్రస్థాయిలో చతికిలపడింది. విద్యార్థులపై సంచుల భారం తగ్గించడంతోపాటు వారిలో సృజనాత్మకత నైపుణ్యాలను పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి శనివారం నో బ్యాగ్ డేను ప్రకటించారు. గతంలో ఈ కార్యక్రమం ప్రతి నెలలో మూడో శనివారం నిర్వహించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి శనివారం ఈ కార్యక్రమం జరిగేలా 2025-26 విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తోంది. కానీ ప్రస్తుతం ఈ విధానం ఎక్కడా కూడా పక్కాగా అమలు కావడం లేదు.



అయితే నో బ్యాగ్ డేను ప్రతి పాఠశాలలో పటిష్ఠంగా నిర్వహించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నో బ్యాగ్ డే ఉద్దేశం కేవలం విద్యార్థులు పుస్తకాలు తీసుకురాకపోవడం మాత్రమే కాదు. తరగతి గదిలో పాఠాలకే పరిమితం కాకుండా అనుభవం, ఆట, కళలు, నైపుణ్యాలు ద్వారా నేర్చుకున్న విధానాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

ఆదేశాలు జారీ చేసినా..

ఉదయగిరి నియోజకవర్గంలో 342 ప్రాథమిక పాఠశాలలతోపాటు 47 ప్రాథమికోన్నత, 51 ఉన్నత పాఠశాలలున్నాయి. అలాగే నాలుగు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, నాలుగు ఆదర్శ పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 28 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పర్యవేక్షణ లేక...

అయితే నియోజకవర్గంలోని అత్యధిక పాఠశాలల్లో ప్రతి శనివారం మిగిలిన రోజుల్లాగానే బ్యాగులతో పాఠశాలలకు వెళుతున్నారు. నో బ్యాగ్ డే కేవలం పేరుకే నిర్వహిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సంబంధిత విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతోంది. ఈ విషయమై డీఈవో బాలాజీరావును వివరణ కోరగా ప్రతి పాఠశాలలో ప్రతి శనివారం నో బ్యాగ్ డే పటిష్ఠంగా అమలు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాట్సప్‌లోనే సదరం సేవలు

దివ్యాంగులకు సదరం సేవలను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇదివరకు సదరం ధ్రువపత్రాలను పొందటానికి స్లాట్ బుకింగ్ కోసం మీ-సేవ కేంద్రాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇకపై అలాంటి అవసరం లేకుండా ప్రభుత్వం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి నుంచే సదరం సేవలను పొందే అవకాశం కల్పించింది.

నమోదు ఇలా..: ముందుగా చరవాణిలో ప్రభుత్వం తీసుకుని వచ్చిన మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ నంబరు 95523 00009ను సేవ్ చేసుకోవాలి. తరువాత ఆ నంబరుకు హాయ్ అని సందేశం పంపించాలి. వెంటనే కనిపించే సిటిజన్ సర్వీసెస్‌లో సదరంను ఎంపిక చేసుకోవాలి. అనంతరం సదరం స్లాట్ లభ్యత, బుకింగ్, ధ్రువీకరణపత్రం డౌన్‌లోడ్ ఆప్షన్లు వస్తాయి. అందులో మనకు అవసరమైన సేవలను ఎంచుకోవాలి. సూచించిన వివరాలను నమోదుచేసి మనకు కావాల్సిన సేవలను పూర్తి చేసుకోవచ్చు.
–న్యూస్‌టుడే, దుత్తలూరు

గూడూరు

•గూడూరు •కోవూరు •సర్వేపల్లి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

బద్దలైన నిశ్శబ్దం పుస్తకావిష్కరణ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం 'బద్దలైన నిశ్శబ్దం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యులు దయాకర్‌రెడ్డి గాంధీ, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఖాదీ, నూలు వస్త్రములు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య : పొదలకూరు మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన పొలాలకు వెళ్లే దారి ఆక్రమించడంతో ఇబ్బందులు పడుతున్నాం. - **శ్రీనివాసులు, స్థానికుడు**

సమాధానం: సర్వే చేసి ఆక్రమించిన దారులు తొలగిస్తాం. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. - **శివకృష్ణయ్య, తహసీల్దారు**

? కోట మండలం గోవిందపల్లి మార్గంలోని ర.భ రోడ్డు పలు చోట్ల గుంతలయమైంది. తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నాం.
- **గజేంద్ర, వాహనచోదకుడు**

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
- **మల్లికార్జునరావు, ర.భ ఇన్‌ఛార్జి ఏఈ**

? గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.
- **శివకుమార్, స్థానికుడు**

✓ సిబ్బందికి చెప్పి వెంటనే తొలగిస్తాం.
- **మల్లికార్జున్‌రావు, కమిషనర్, గూడూరు**

? తోటపల్లిగూడూరు మండలంలోని మల్లికార్జునపురం వద్ద పారుదల కాలువలోని గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలను తొలగించాలి.
- **రమణయ్య, స్థానికుడు**

✓ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - **అలీ నీటిపారుదలశాఖ ఏఈ**

? తోటపల్లిగూడూరు మండలం రావూరివారికండ్రిగ వద్ద రోడ్డు పక్కనే పేడ దిబ్బలు, వ్యర్థాలు వేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - **సుధాకర్, స్థానికుడు**

✓ పరిశీలించి వ్యర్థాలను తొలగిస్తాం.
- **విరిత, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు రూరల్ పరిధిలోని అమ్మవారిపాలెంలో ఓ విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుపోవడంతో సరఫరాలో అంతరాయం కలుగుతోంది. - **సుభాష్, స్థానికుడు**

✓ సిబ్బందిని పంపి తొలగిస్తాం.
- **రఘు డిస్కం ఏఈ**

క్రీడలతో నూతనోత్సాహం



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏ వయసు వారైనా ఏ వృత్తిలో ఉన్న వారికైనా క్రీడలు ఆడడం వల్ల నూతనోత్సాహం వస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారంగూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్‌రావు, సంస్థ ప్రతినిధులు కడవేటి చంద్రశేఖర్, దువ్వూరు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సౌర వెలుగులు

కోవూరు డివిజన్‌లో ముమ్మరంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు

ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'ను అమలు చేస్తోంది. కరెంట్ బిల్లుల భారం తగ్గింపే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ పథకం.. కోవూరు డివిజన్‌లో సత్ఫలితాలనిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యుత్తు రాయితీ పొందుతున్న ఎస్సీ, ఎస్టీల గృహాలపై సోలార్ ప్యానళ్లను ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు.

50 శాతానికిపైగా..

ఏపీఎస్పీడీసీఎల్ కోవూరు డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు లక్ష్యానికి అనుగుణంగా వేగంగా సాగుతోంది.



ఇందుకూరుపేటలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్‌ప్యానెల్స్

డివిజన్ పరిధిలో 8469 ఇళ్లపై ఏర్పాటు చేయడం లక్ష్యం కాగా, 4300ఇళ్లపై.. ఒక్కోదానిపై రెండు కిలోవాట్ల సామర్థ్యమున్న సౌర విద్యుత్తు ఫలకాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. 50 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోందని అధికారులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగం, రేషన్‌కార్డు ఉన్న వెనకబడిన వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

లక్ష్యాన్ని చేరుకుంటాం

వేసవికాలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలపై ఏర్పాటు చేసే రెండు కిలోవాట్ల ప్యానళ్లతో ఒక్కో ఇంటి నుంచి నెలకు 280 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. సగటున 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నాం. ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఏర్పాటు చేసిన వాటి ద్వారా దాదాపు 50 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. సెప్టెంబరు మొదటి వారానికి నిర్దేశించిన లక్ష్యం చేరుకుంటాం.

రమేష్‌చౌదరి, ఎస్పీడీసీఎల్ డీఈ, కోవూరు

బస్టాండ్‌లో అత్యవసరానికి అవస్థ



మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: పొదలకూరు బస్టాండులో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పది రోజులుగా వ్యర్థజలాలు, మూత్రం తరలించే పైపులు మరమ్మతులకు గురికావడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. వినియోగించుకోలేన్నంతగా దుర్వాసన రావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీసం అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇటీవల రూ.లక్షలు వెచ్చించి బస్టాండ్‌లో వసతులు కల్పించారు. కానీ నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న రెండు మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. సమీపంలో ఎక్కడా ప్రత్యామ్నాయ మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తమ దృష్టికి వచ్చిందని త్వరలో పరిష్కరిస్తామని రాపూరు డిపో మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు

సైదాపురం(గూడూరు పట్టణం), న్యూస్‌టుడే: సైదాపురం మండలంలోని క్రిష్టారెడ్డిపల్లి, సైదాపురం గ్రామాల్లో సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను తహసీల్దారు సుభద్ర ఆదివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు ప్రతి ఒక్కరూ బీఎల్వోలకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యువత విరివిగా రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు యువత విరివిగా రక్తదానం చేయాలని జనసేన నాయకుడు తీగల చంద్రశేఖర్‌రావు తెలిపారు. గూడూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



విడవలూరులోని ప్రభుత్వ పశువైద్యశాల వద్ద రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాలకు తీగజాతి పూల మొక్కలు అల్లుకుపోయాయి. ఆకర్షణగా ఉన్నాయని పూలు కోద్దామని ముట్టుకుంటే విద్యుత్తు షాక్‌కు గురయ్యే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో స్కూల్‌కు వెళ్లేందుకు చిన్నారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురవుతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, విడవలూరు**

గురుకులంలో 15 ఖాళీలు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో వివిధ తరగతుల్లో ఏర్పడిన పోస్టుల భర్తీకి సోమవారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానాచార్యులు పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదో తరగతిలో 6, ఆరులో 2, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 4, బైపీసీలో 3 చొప్పున మొత్తం 15 ఖాళీలున్నాయన్నారు. అర్హులైన వారు తమ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలకు హాజరవ్వాలన్నారు. మార్కుల ఆధారంగా ప్రవేశం లభిస్తుందని చెప్పారు.

పంచ్ కొడితే పతకమే!



న్యూస్‌టుడే, నెల్లూరు (బీవీ నగర్) : ఆమెకు శిక్షకులు లేరు. ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుంది. సీనియర్ క్రీడాకారులను చూసి బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. ఏ పంచ్ కొట్టి ప్రత్యర్థిని ఎలా కట్టడి చేయాలో తెలుసుకుంది. పోటీల్లో పతకాలు సాధిస్తోంది నగరానికి చెందిన సముద్రాల సునయన. ఇటీవల జరిగిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో వెండి పతకం సాధించింది. నగరంలోని బీవీ నగర్‌లో నివాసం ఉంటున్న సంధ్య, చంద్రమౌళి దంపతుల కుమార్తె సునయన. ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్ననాడే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానానికి వెళ్లి సాధన చేస్తోంది. మైదానంలో శిక్షకులు లేకపోయినా సీనియర్ల సూచనలతో మెలకువలు నేర్చుకుంది. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటుకుంది. 2022లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించగా, 2024లో మచిలీపట్నం, వైజాగ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకాలు దక్కించుకుంది. తాజాగా తిరుపతిలో ఏర్పాటుచేసిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ ద్వితీయస్థానంలో నిలిచి పతకం అందుకుంది.

వినియోగంలోకి తీసుకురారూ!

కొడవలూరు మండలంలోని పెయ్యలపాళెంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం శిథిలావస్థకు చేరింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించినా నిర్వహణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. అధికారులు స్పందించి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి సంపద సృష్టి జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **కొడవలూరు, న్యూస్‌టుడే**



రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?



కొడవలూరు మండలంలోని మానేగుంటపాడుకు వెళ్లే దారిలో రోడ్డు గుంతలు పడి కనిపిస్తోంది. కల్వర్టు దెబ్బతింది. వర్షాకాలంలో నీరు నిల్వ చేరి ప్రయాణానికి అసౌకర్యంగా మారుతోంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానిక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

● కొడవలూరు- నార్తురాజుపాళెం మధ్య ఉన్న దిన్నెరోడ్డు దారుణంగా ఉంది. గుంతలు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు మంజూరుచేసి రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, కొడవలూరు**





కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారికి మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు రంధ్రం సరిగా కనపడక పోవడంతో అదుపు తప్పి పడిపోతున్నారు. ● కలువాయిలోని పాత పోస్టాఫీసు వెనుక వీధిలో రోడ్డుమధ్యలో డ్రైనేజీ కాలువపై ఉన్న సిమెంట్ బండ విరిగి పోవడంతో దానిని పంచాయతీ తొలగించి పక్కన పెట్టారు. మరొకటి ఏర్పాటు చేసే విషయాన్ని మరిచిపోయారు. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ బండను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - **కలువాయి, న్యూస్‌టుడే**



రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రాపూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని రాపూరు-చిట్వేలి ఘాట్ రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కడప జిల్లా రాజంపేటకు చెందిన బి.చతుర్వేదేశ్వర్ ద్విచక్రవాహనంపై రాపూరు మీదుగా తిరుపతికి వెళ్తుండగా ఘాట్ రోడ్డు 11-12వ కి.మీ మధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. 108 సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాల దగ్ధం

మనుబోలు, న్యూస్‌టుడే: మనుబోలు తూర్పువీధిలోని పలు ఇళ్లల్లో హై వోల్టేజీ కారణంగా టీవీ, ఫ్రిజ్, ఏసీ వంటి గృహోపకరణాలు దగ్ధమైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. చెట్టుకొమ్మలు పడటంతో విద్యుత్తు తీగలు ఒకదానికొకటి తగిలి అధిక వోల్టేజీ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న సిబ్బంది సరఫరాను నిలిపేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. తరచూ విద్యుత్తు సరఫరాల్లో హెచ్చుతగ్గులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

తోటపల్లిగూడూరు: ఇస్కపాలెం గ్రామంలో ఆదివారం గ్రామదేవత ఉత్సవాల్లో బాణసంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు పడటంతో చంద్రశేఖర్ అనే వ్యక్తికి చెందిన పూరిల్లు కాలిపోయింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఘనంగా గంగమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన భక్తులు

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరులో గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అనంతరం నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. **కొడవలూరు:** మండలంలోని పెయ్యలపాళెంలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం వేడుకగా జరిగింది. గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

జంతువులపై ప్రతి ఒక్కరూ కరుణ చూపాలి

నెల్లూరు (మార్కెట్ సెంటర్) : జంతువుల పట్ల మానవత్వం చూపాలని ఫౌండేషన్ ఫర్ యానిమల్స్ వ్యవస్థాపకురాలు ఉమాదేవి సూచించారు. నగరంలోని టౌన్‌హాల్ వర్ధమాన సమాజంలో ఆదివారం జంతు ప్రేమికులతో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కలు, ఆవులు తదితర వాటిని ఆదరిస్తే ప్రకృతిలో సమతుల్యత ఉంటుందని చెప్పారు. జంతు హింసను నివారించి ప్రతిఒక్కరూ వాటితో కలిసి జీవించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో ఉంటున్న మేరమ్మ(70) అనే అనాథ వృద్ధురాలు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆశ్రమ నిర్వాహకురాలు మెగా బ్రదర్స్ సేవా సమితి ప్రతినిధులకు విషయం తెలపడంతో వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. సమితి వ్యవస్థాపకుడు చంద్రశేఖర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి వెంట చెత్త.. తప్పని అవస్థ



పొదలకూరు పట్టణంలో ఇళ్ల వద్ద నుంచి సేకరించిన చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పొట్టేలువాగు వద్ద మనుబోలు మార్గం వెంబడి డంపింగ్ చేస్తున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాలను పశువులు, పందులు, కుక్కలు కలియబెడుతున్నాయి. దీంతో రోడ్డుపైకి వస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డులో చెత్తాచెదారాలు పోసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - **పొదలకూరు, న్యూస్‌టుడే**

పారిశుద్ధ్యమా.. అదెక్కడా!

పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. ఉన్నతాధికారులు అవగాహన కల్పిస్తున్నా అటు స్థానికుల్లో ఇటు క్షేత్రస్థాయి అధికారుల్లో మార్పు రావడం లేదు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. మురుగు కాలువలు పూడికతో నిండిపోతున్నాయి. రోడ్ల వెంట నీరు ప్రవహిస్తోంది. నెలకోసారైనా పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. - **సైదాపురం(గూడూరు పట్టణం), కోట, సైదాపురం, కలువాయి, పొదలకూరు రూరల్, విడవలూరు, న్యూస్‌టుడే**



పాదచారులకు ఇక్కట్లు

మండల కేంద్రమైన కలువాయిలోని ముస్లింపాలెంలో మసీదు వద్ద డ్రైనేజీ కాలువలో నీరు పొంగి రోడ్డుపై చేరుతోంది. వివిధ రకాల వ్యర్థాలతో కాలువ నిండిపోవడంతో నీరు పొంగి రోడ్డుపైకి వస్తోంది. దీంతో పాదచారులు తొక్కుకుంటూ నడవాల్సిన పరిస్థితి వచ్చింది.


ప్లాస్టిక్ వ్యర్థాలతో పంట కాలువలు



కోట మండలంలోని కోట, విద్యానగర్, చిట్టేడు, కేశవరం, కొత్తపట్నంతో పాటు పలు పంచాయతీల్లో ప్లాస్టిక్ సంచులు విరిగా వాడుతూ ఎక్కడపడితే అక్కడ పడవేస్తున్నారు. ప్రధాన పంటకాలువలు, చెరువులు, స్వర్ణముఖి, చల్లకాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిడిపోతున్నాయి. ఈ విషయమై కోట ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ.. త్వరలోనే పంచాయతీల్లో ప్లాస్టిక్ వాడకంపై పూర్తి స్థాయిలో నిషేధం విధిస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

పూడిక తీయక

పొదలకూరు శ్రీహరికాలనీ మొదటి వీధిలోని సైడు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు ముందుకు కదలడం లేదు. రాత్రి సమయాల్లో దోమల వ్యాప్తితో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెత్త రిక్షాలు.. నిరుపయోగంగా!



విడవలూరులోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో గ్రామాల్లో చెత్త సేకరించేందుకు ప్రభుత్వం అందజేసిన చెత్త రిక్షాలు నాలుగు నెలల నుంచి నిరుపయోగంగా ఉండడంతో తుప్పు పడుతున్నాయి. వారం రోజుల కిందట వాటిని పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లి మూతబడిన బీసీ హాస్టల్ వద్ద ఉంచారు. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డుపై మురుగు

ఇటీవల కురిసిన వర్షానికి సైదాపురం మండలం కలిచేడు గ్రామంలో నడిరోడ్డుపై మురుగునీరు నిల్వ చేరింది. విద్యార్థులు, ప్రజలు రాకపోకల సమయంలో అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

పేదల నివాసాలు వక్ఫ్ భూములనడమేమిటి: సీపీఎం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : ఓట్ల కోసం రావడం కాదని, ప్రజా సమస్యలు పాలకుల పరిష్కరించాలని సీపీఎం నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని 16వ డివిజన్ సీపీఎం నూతన కమిటీ ఎంపిక చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్‌లో 50 ఏళ్లుగా నివాసాలు ఉంటున్న పేదల ఇళ్ల స్థలాలు నేడు వక్ఫ్ బోర్డు భూములు అని ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ఇళ్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పునరుద్ధరించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శిగా రాజశేఖర్‌నాయుడు, కోశాధికారిగా రామచంద్రారెడ్డి, గౌరవ సలహాదారుగా సుబ్బరాయుడు తదితరులు ఎంపికయ్యారు.

కొవ్వొత్తులతో కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



ప్రదర్శనలో కాంట్రాక్టు ఉద్యోగులు

నెల్లూరు (బీవీ నగర్), న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఆదివారం రాత్రి నగరంలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర మెడికల్ హెల్త్‌కేర్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ జేఏసీ పిలుపు మేరకు ఆసుపత్రి ఆవరణలో ఉత్తర్వుల క్రమం చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి ఆన్‌లైన్ విధులు చేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ శరత్‌బాబు, పి.వేణు, రూత్ గ్రేస్, సిస్టర్ మేరీ, మాధురి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసింది..

సా.. గుతున్న ఆకాశ వంతెన పనులు ● మరో రెండు నెలలు పట్టే అవకాశం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ, బీవీనగర్)

నగరంలో నూతన వంతెనలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇటీవల పెన్నానదిపై కొత్త వంతెన పూర్తికావడంతో వాహనదారులు దానిపై రాకపోకలు సాగిస్తున్నారు. నగరానికి దక్షిణాన ఉన్న జాతీయ రహదారిపై మరో నూతన వంతెన పనులు వేగంగా సాగుతున్నాయి. ఈనెల 31తో గడువు ముగిసింది. గ్రేస్ పీరియడ్ కింద మరో నెల పొడిగించే అవకాశం ఉంది. అప్పటికైనా పూర్తవుతుందా అన్న అనుమానం కలుగుతోంది.

90శాతం పూర్తి

నగరంలో అయ్యప్ప ఆలయం తరువాత బుజబుజనెల్లూరు వద్ద 5(16)వ నెంబర్ జాతీయ రహదారిపై టీ జంక్షన్ సమీపంలో ఆరు వరుసల ఆకాశ వంతెన మంజూరైంది. ప్రాజెక్టులో భాగంగా వంతెనతోపాటు గొలగమూడి రహదారి కూడలి వద్ద వాహనాలు వెళ్లేందుకు ముందుగా అండర్ పాస్ నిర్మిస్తున్నారు. ఈ పనులకు సంబంధించి ఒకే ప్రాజెక్ట్ కింద రూ.74.88 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం వంతెన పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి.



బుజబుజనెల్లూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన

త్వరలోనే అందుబాటులోకి

2022 నవంబరులో పనులకు ఆమోదం లభించింది. 2023 డిసెంబరులో హైదరాబాద్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ నిర్మాణానికి ఒప్పందం చేసుకుంది. 2024 జూన్ 18వ తేదీ నాటికి పనులు పూర్తిచేయాల్సి ఉండగా పలుచోట్ల కాలువలు అడ్డుగా ఉండటం, ఇళ్ల ఆక్రమణలు, వర్షాలు ఇలా పలు కారణాలతో నిర్దేశిత సమయానికి పూర్తికాలేదు. దీంతో అధికారులు ఢిల్లీ నుంచి పొడిగింపునకు అనుమతులు పొందారు. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా రోడ్లు నిర్మిస్తున్నారు. కంకర పరుస్తున్నారు. దానిపై తారు వేయాల్సి ఉంది. ఇరువైపులా చివర కాంక్రీట్‌తో గోడలు నిర్మాణం జరుగుతోంది. ఇవన్నీ పూర్తికావాలంటే రెండు నెలల సమయం అవసరం. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

పంచ్ కొడితే పతకమే! బాక్సింగ్ పోటీల్లో సునయన సత్తా



సునయన

న్యూస్‌టుడే, నెల్లూరు (బీవీ నగర్)

ఆమెకు శిక్షకులు లేరు. ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుంది. సీనియర్ క్రీడాకారులను చూసి బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. ఏ పంచ్ కొట్టి ప్రత్యర్థిని ఎలా కట్టడి చేయాలో తెలుసుకుంది. పోటీల్లో పతకాలు సాధిస్తోంది నగరానికి చెందిన సముద్రాల సునయన. బీవీ నగర్‌లో నివాసం ఉంటున్న సంధ్య, చంద్రమౌళి దంపతుల కుమార్తె సునయన. ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్ననాటే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో సాధన చేస్తోంది. మైదానంలో శిక్షకులు లేకపోయినా సీనియర్ల సూచనలతో మెలకువలు నేర్చుకుంది. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చాటుకుంది. 2022లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించగా, 2024లో మచిలీపట్నం, వైజాగ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకాలు దక్కించుకుంది. తాజాగా తిరుపతిలో ఏర్పాటుచేసిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లోనూ ద్వితీయస్థానంలో నిలిచి పతకం అందుకుంది.

అమ్మవారి సేవ పూర్వజన్మ సుకృతం: నారాయణ



భూమి పూజ చేస్తున్న మంత్రి నారాయణ దంపతులు, మేయర్ సుజాత

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నగరంలోని నవాబుపేటలో బలిజ మహాలక్ష్మి అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ దంపతులు ఈ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ వారి సేవ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. 2019లో ఆలయానికి 23 అంకణాల స్థలానికి రూ.28 లక్షలు సొంత నిధులు అందించినట్లు తెలిపారు. దాతల సాయంతో రూ.1.01 కోట్ల అంచనాతో పునర్నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక మహిళలు మంత్రి రాఖీలు కట్టారు. ఆలయ పునర్నిర్మాణానికి డాక్టర్ పోకల రవి రూ.5 లక్షలు, పప్పు నారాయణ రూ.2 లక్షలు, సుబ్రహ్మణ్యం రూ.లక్ష, రంగయ్యనాయుడు రూ.25 వేలు వంతున విరాళాలను ఆలయ కమిటీకి అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తెదేపా నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి పాల్గొన్నారు.

శిథిలాలు.. రాకపోకలకు అవస్థలు



నగరంలోని చిన్నబజారులో బాషా మసీదు ముందు రోడ్డుపై శిథిలాలు, పైపు ప్రమాదకరంగా మారాయి. వీటితో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పండ్ల మార్కెట్ ఉండటంతో నిత్యం భారీ వాహనాలు వస్తుంటాయి. –న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

కుక్కలు కాటేయవా!

నగరంలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిళ్లు వీధుల్లోకి ప్రజలు రావాలంటే హడలిపోతున్నారు. కుక్కలగుంట మహాలక్ష్మి దేవస్థానం వద్ద అధికంగా ఉన్నాయి. అధికారులు స్పందించి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



గ్రంథాలయం.. భయం.. భయం



నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. దిగువ అంతస్తులో ఓ గది స్లాబు దెబ్బతింది. ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో అధికారులు ఈ గది ఖాళీగా ఉంచారు. దీని పక్కనే విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

మ్యాన్‌హోల్.. చూడకుంటే ఆసుపత్రికే!

నగరంలోని చైతన్యపురి కాలనీ అయిదో వీధిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు కన్నా ఎత్తుగా ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు ఎక్కువగా పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీన్ని సరిచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)



కనులపండువగా రాఘవేంద్రుడి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని మండపాల వీధిలో రాఘవేంద్ర స్వామి ఆరాధన ఆదివారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు నందగిరి జనార్దనరావు, గురుచరణ్ పర్యవేక్షించారు.

కదిలే వేగనిరోధకాలు.. వాహన ప్రమాదాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నగరంలో కదిలే వేగ నిరోధకాలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వేగ నిరోధకాలు కదలడమేమిటా అనుకుంటున్నారా.. అవేనండి.. పశువులు. ఇవి వీధుల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కొన్నిచోట్ల అలాగే మధ్యలో నిలిచిపోతున్నాయి. వీటితో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సమస్యను అధికారులకు విన్నవించినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం

రాత్రిళ్లు రోడ్డు మధ్యలో ఉండడంతో భారీ వాహనాలు నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు వీటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. వీటికి తోడు కోతులు ఆవాస ప్రాంతాలకు వస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు.

గంటల కొద్దీ కదలకుండా..

నగరంలోని జీఎన్‌టీ, పొదలకూరు, వాకర్స్, మినీబైపాస్ రోడ్లు తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా పశువులు కనిపిస్తున్నాయి. ఆర్టీసీ, మద్రాసు బస్టాండు ప్రాంతాల్లో రోడ్డుపైనే విశ్రమిస్తున్నాయి. గంటల కొద్దీ రద్దీదారుల్లో ఉంటూ వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి.

రూ.2 వేలకు తెచ్చి రూ.20 వేలకు విక్రయం

కొందరు పశువులను రూ.2 వేలకు కొనుగోలు చేసి తీసుకొచ్చి నగరంలో విడిచిపెడుతున్నారు. ఆరు నెలల తరువాత కబేళాకు రూ.20 వేల వంతున విక్రయిస్తున్నారు. ఒక్కొక్కరు 10 నుంచి 20 వరకు తీసుకొచ్చి వదిలేస్తున్నారు. అవి చెత్తాచెదారం, మార్కెట్లలో వ్యర్థాలను తింటూ తిరుగుతున్నాయి. పశువుల యజమానుల్లో కొందరు పోలీసులు కూడా ఉండటం గమనార్హం. వీటిని నియంత్రిస్తామని నగరపాలకసంస్థ కమిషనర్ నందన్ వివరించారు.

వేమిరెడ్డిపై అనిల్ ఆరోపణలు విడ్డూరం: రూప్‌కుమార్

నెల్లూరు(నగరపాలకసంస్థ): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపణలు చేయడం విడ్డూరమని నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందు నుంచే వేమిరెడ్డి సొంత డబ్బుతో ధార్మిక, సంక్షేమ సేవలు చేస్తున్నారని తెలిపారు. అధికారంతో రూ. కోట్లు సంపాదించి ఓడిపోగానే రాష్ట్రం వదిలి వెళ్లిన అనిల్ స్థాయి ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. సైదాపురం క్వార్ట్జ్ మైన్ యజమానులను వేమిరెడ్డి రూ.8 వేల నుంచి రూ.10వేలు అడిగారని అనిల్ చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఒక్క మైన్ యజమానితో చెప్పించినా దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు.

నూతన బైపాస్‌పై ప్రయాణం.. సంకటం

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

నెల్లూరు నగరం కిసాన్‌నగర్ జాతీయ రహదారి నుంచి కొత్తకాలువ- కోడూరుపాడు రోడ్డుకు అనుసంధానంగా ఉండే కొత్త బైపాస్‌పై ప్రయాణమంటే వాహనదారులు హడలిపోతున్నారు. గతంలో కొత్తకాలువ మీదుగా కోడూరుపాడు వైపు రాకపోకలు సాగేవి. ఆ మార్గంలోని ప్రజలకు దూరాభారాన్ని తగ్గించేందుకు అయిదేళ్ల క్రితం నాలుగు కి.మీ.లకుపైగా తారుతో కొత్త బైపాస్ నిర్మించారు. కోడూరుపాడు వైపు ప్రాంతాల నుంచి నగరం, వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇది ఉపయోగకరంగా మారింది. రోడ్డుకి ఇరువైపుల ప్రాంతాలైన యనమలపాళెం, దోసకాయల దిబ్బ, సాయినగర్ తదితర ప్రాంతాలు అభివృద్ధి చెందాయి.



రోడ్డుపై కంకర పాడితో తాత్కాలిక పనులు

తరచూ గుంతలమయం

కొత్తబైపాస్ రోడ్డు మరమ్మతులకు గురికావడం సర్వసాధారణమైంది. నాసిరకంగా నిర్మించారనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్మించిన కొద్ది కాలానికే పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏడాది క్రితం రూ.20లక్షలకు పైగా వెచ్చించి మరమ్మతు పనులు చేశారు. ప్రస్తుతం పలుచోట్ల రోడ్డుపై తారు, కంకర లేచి గుంతలమయంగా తయారైంది. రహదారికి సమీపంలో పెన్నా పరివాహక ప్రాంతం ఉంది. బాటలు ఏర్పరుచుకుని ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పలు పరిశ్రమలు ఉండడంతో భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు దెబ్బతింటోంది. వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
నెల్లూరు, గ్రామీణం
80085 50332
80085 74001

సమస్య: బారా షహీద్ దర్గా ఆవరణలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వీటితో భక్తులు, సందర్శకులు భయాందోళన చెందుతున్నారు. – షంషుద్దీన్, స్థానికుడు

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? పోస్టల్ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – అనిత, స్థానికురాలు

✓ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

జంతువులపై మానవత్వం చూపాలి

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: జంతువుల పట్ల మానవత్వం చూపాలని ఫౌండేషన్ ఫర్ యానిమల్స్ వ్యవస్థాపకురాలు ఉమాదేవి సూచించారు. నగరంలోని టౌన్‌హాల్ వర్ధమాన సమాజంలో ఆదివారం జంతు ప్రేమికులతో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కలు, ఆవులు తదితర వాటిని ఆదరిస్తే ప్రకృతిలో సమతుల్యత ఉంటుందని చెప్పారు. ప్రతిఒక్కరూ వాటితో కలిసి జీవించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చైనీయుడి మైనింగ్ దందా

మాజీ మంత్రి అనిల్‌కుమార్ ధ్వజం

నెల్లూరు (బీవీ నగర్): రాష్ట్ర మైనింగ్ వ్యవస్థను 'డా' అనే ఒక చైనా వ్యక్తి శాసిస్తున్నారని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) సహకారంతోనే ఈ దందా సాగుతుందని మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'మల్టీ ఎలిమెంట్' కంపెనీకి చెందిన 'డా' అనే చైనా వాసి ఇక్కడికొచ్చి మన వ్యవస్థను శాసించడం దేశ ద్రోహమేనని, దేశ భద్రతకు కూడా ముప్పేనని అనుమానం వ్యక్తం చేశారు. దౌర్జన్యాలకు తలొగ్గని కారణంగా జిల్లాలోని 147 లీజుల్లో 49 మైన్లను మూసివేయించారని ప్రకటించారు. పురాతన ప్రాంతమైన సిద్ధలకోనలోనూ తవ్వకాలు చేస్తున్నారన్నారు. నా ఆరోపణలు అవాస్తవమైతే.. సీబీఐతో విచారణ చేయించాలని సవాల్ చేశారు. చైనా వ్యక్తిపై కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే!



నగరంలోని కలెక్టరేట్ ఎదురు వీధిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిమెంటు రోడ్డు మధ్యలో కాలువలో నుంచి పూడిక తీసేందుకు ఇనుప కంచె ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలతో దెబ్బతింది. రాత్రిళ్లు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్థానికులు రాళ్లను అడ్డుగా పెట్టి ప్రమాదాలను నివారిస్తున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

బద్దలైన నిశ్శబ్దం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం 'బద్దలైన నిశ్శబ్దం' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు శేషు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి ద్వంద్వ వైఖరి: తెదేపా

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: అధికారంలో ఉంటే ఒకలా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా మాట్లాడడం వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నైజమని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి ఆరోపించారు. ఆదివారం నెల్లూరులోని తెదేపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నారు. నాడు బలవంతపు ఏకగ్రీవాలు చేయడమే కాకుండా, తన పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని సమర్థించుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో ఏకగ్రీవాలే జరగకూడదని అంటున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు.

కృష్ణాష్టమి వేడుకలకు శ్రీకారం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని బాలాజీ నగర్ పిండిమిల్లు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. చిరంజీవి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు, కృష్ణ భక్త కమిటీ సేవకుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉత్సవాల కోసం పూజలు చేశారు.

శివారు కాలనీలు.. సమస్యలకు నిలయాలు



వైఎస్సార్ నగర్‌లో ఇదీ పరిస్థితి

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

నగరంలోని శివారు ప్రాంతాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. అధ్వాన రహదారులు.. పూడికతో నిండిన కాలువలతో నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. తాగునీరు సరిపోక దప్పికతో అలమటిస్తున్నారు. వీటిపై అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నగర శివారులో వైఎస్సార్ కాలనీ, కుమ్మరగుంటలో రోడ్లు, కాలువలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ కాలనీలో 20 వీధులు ఉండగా ఎనిమిది బజార్లకు రోడ్లు వేశారు. మిగిలిన వాటిలో వేయకపోవడంతో చిన్న వర్షం కురిసినా నీరు చేరి బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసనతో అల్లాడుతున్నామని వాపోతున్నారు. రాత్రిళ్లు దోమలు అధికమవుతుండడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

కుమ్మరగుంటలో వసతుల కరవు

వైఎస్సార్ కాలనీ పక్కనే ఉన్న కుమ్మరగుంటలో వారం రోజులుగా విద్యుత్తు సరఫరా సక్రమంగా లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇళ్ల వద్దకు చెత్త తీసుకెళ్లే వాహనాలు రాకపోవడంతో వ్యర్థాలు ఉంచుకోలేక ఇబ్బందులు పడుతున్నామని మండిపడుతున్నారు. తాగునీరు రోజు మార్చి రోజు వస్తోంది. ఇది చాలక నిత్యావసరాలకు అగచాట్లు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రతపై పోలీసుల అవగాహన

నెల్లూరు (బీవీ నగర్), న్యూస్‌టుడే: మహిళలు, బాలికలు, చిన్నారులకు భద్రతపై ఆదివారం పోలీసులు అవగాహన కల్పించారు. నగరంలోని దర్గామిట్ట, సంతపేట పోలీసుస్టేషన్ల పరిధిలోని ఆయా ప్రాంతాల ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాలల్లో సదస్సులు నిర్వహించారు. పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిరోధం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు కల్యాణరాజు, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, వైవీ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న పోలీసులు